ప్రజాశక్తి

శుక్రవారం 2 జూన్ 2023



రైతు భరోసా పంట నష్టపరిహారం మెగా చెక్కులను అందిస్తున్న కలెక్టర్ జెడ్పీ ఛైర్‌పర్సన్

# రైతుకోసం సాయం

## పెట్టుబడి సాయాన్ని సద్వినియోగం చేసుకోండి

## కలెక్టర్ అరుణ్‌బాబు, జెడ్పీ ఛైర్‌పర్సన్ గిరిజమ్మ

**ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్**

ఖరీఫ్ సీజన్ ప్రారంభాన్ని దృష్టిలో ఉంచుకుని రైతుల కోసం ప్రభుత్వం రైతు భరోసా సాయాన్ని అందిస్తోందని, దీనిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ అరుణ్‌బాబు, జెడ్పీ ఛైర్‌పర్సన్ గిరిజమ్మ పేర్కొన్నారు. 5 ఏడాది పిఎం కిసాన్, రైతు భరోసా సాయం జిల్లా స్థాయి పంపిణీ కార్యక్రమాన్ని గురువారం పుట్టపర్తి పట్టణంలోని సాయి ఆరమంలో నిర్వహించారు. రైతు భరోసా, పిఎం కిసాన్ కింద మొదటి విడతలో భాగంగా జిల్లాలో 2,75,331 మంది రైతులకు రూ.206.49 కోట్ల పెట్టుబడి సాయాన్ని నేరుగా వారి ఖాతాల్లకి జమ చేశారు. దీంతో పాటు ఈ ఏడాది మార్చి నెలలో అధిక వర్షాలు, గాలుల వల్ల పంట నష్టపోయిన 716 మంది రైతులకు రూ.49.2 లక్షల నష్టపరిహారాన్ని అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ పంట సాగుకు రైతులు ఎలాంటి ఇబ్బందులూ పడకూడదన్న ఉద్దేశంతో ఈ సాయాన్ని అందిస్తోందని చెప్పారు. ఈ సాయాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 2023వ ఏడాది మార్చి నెలలో అధిక వర్షాలు, గాలుల వల్ల 716 మంది రైతులకు చెందిన 349.13 హెక్టార్లలో వ్యవసాయ, ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లిందని దీనికి సంబంధించి రూ.49.2 లక్షల నష్టపరిహారం అందజేస్తున్నట్లు చెప్పారు. జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్ రెడ్డి రైతుల పక్షపాతిగా పరిపాలన సాగిస్తున్నారని చెప్పారు. గత పాలకులు రైతులకు అబద్ధపు హామీలు ఇచ్చి వాటిని నెరవేర్చలేదన్నారు. జగన్మోహన్ రెడ్డి రైతుల కష్టాలను తెలుసుకుని వారి అండగా నిలుస్తున్నారని చెప్పారు. అనంతరం రైతు భరోసా, పంట నష్టం పరిహారం మెగా చెక్కులను రైతులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అగ్రి అడ్వైజరీ బోర్డ్ ఛైర్మన్ రమణారెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి సుబ్బారావు, ఆర్డీవో భాగ్యరేఖ, జిల్లా ఉద్యాన శాఖ అధికారి చంద్రశేఖర్, పట్టుపరిశ్రమ శాఖ జెడి పద్మమ్మ, పశుసంవర్ధక శాఖ జెడి శుభదాస్, ఎపిఎంఐపి పీడీ సుదర్శన్, ఏడీఏ విద్యావతి, ఎంపిపి రమణారెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ తుంగా ఓబులపతి, పుడా ఛైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ, మార్కెట్ యార్డ్ ఛైర్మన్ శ్రీనివాసరెడ్డి, జడ్పిటిసి గంగాదేవి, రైతులు పాల్గొన్నారు.

# బాభౌయ్..!

◆ రోడ్లపై పెరుగుతున్న కుక్కలదాడులు

◆ ద్విచక్రవాహనాల వెంట పరుగులు

◆ భయపడి కిందపడుతున్న వాహనదారులు

◆ ఉమ్మడి జిల్లాలో శునకాల స్వైర విహారం

"రెండు రోజుల క్రితం అనంతపురం నగరంలో ఓ ప్రయివేటు ఉద్యోగి విధులు ముగించుకుని రాత్రి పది గంటల సమయంలో ఇంటికి ద్విచక్రవాహనంలో బయల్దేరాడు. హౌసింగ్ బోర్డు సర్కిల్ వద్దకు రాగానే గుంపుగా ఉన్న కుక్కలు అతని వాహనాన్ని వెంబడించాయి. దీంతో ఆయన భయపడి వేగంగా వాహనం నడపడంతో అదుపు కిందపడ్డాడు. దీంతో ఆయన గాయపడ్డాడు".

"శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణంలో బుధవారం నాడు ఓ బాలికపై కుక్కలు భౌతికదాడి చేసి గాయపర్చాయి. కేశవనగర్‌కు చెందిన పదేళ్ల బాలిక తినుబండారులు తెచ్చుకునేందుకు ఇంటి వద్ద ఉన్న అంగడికి వెళ్తుండగా మూడు కుక్కలు దాడి చేశాయి. ఈ దాడిలో బాలికకు రక్తగాయాలు అయ్యాయి. స్థానికులు స్పందించి కుక్కలను అడ్డుకోవడంతో పెనుప్రమాదం తప్పింది. ఇదే వీధిలో వారం రోజుల క్రితం ఓ వృద్ధుడిపై కూడా కుక్కలు దాడి చేసి గాయపర్చాయి".

**ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్**

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇటీవల ప్రజలపై కుక్కల దాడులు అధికం అయ్యాయి. గుంపులుగుంపులుగా రోట్లపైకి వచ్చే శునకాలు జనంపై దాడి చేసి గాయపరుస్తున్నాయి. పట్టణం పల్లె అన్న తేడా లేకుండా అన్ని ప్రాంతాల్లో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. పట్టణ ప్రాంతాల్లో ఇటీవల కుక్కలదాడిలో గాయపడి ఆసుపత్రికి వెళ్లే వారి సంఖ్య అధికంగా ఉంటోంది. అనంతపురం లాంటి ప్రాంతాల్లో ప్రతి రోజూ 10 మందికి పైగా కుక్కకాటుకు గురవు తున్నట్లు తెలుస్తోంది. కొన్ని ప్రాంతాల్లో అయితే రోడ్లపై ఉన్న కుక్కల గుంపును చూసి ఆ వీధుల్లోకి వెళ్లేందుకు జనం భయపడు తున్నారు. ఇటీవల కాలంలో శునకాలకు సంతాన నియంత్రణ ఆపరేషన్లు చేయక పోవడంతో వాటి సంఖ్య విపరీతంగా పెరిగింది. గత నాలుగేళ్ల క్రితం వీధుల్లో కుక్కల నియంత్రణకు సంబంధిత మున్సిపల్,కార్పొరేషన్ అధికారులు సంతన నియంత్రణ ఆపరేషన్లు చేశారు. దాని వల్ల అప్పట్లో వాటి సంఖ్య కాస్త తగ్గింది. మళ్లీ అలాంటి కార్యక్రమం చేపట్టకపోవడంతో కుక్కల సంఖ్య పెరిగింది. ఇవి వీధుల్లోనే ఉండడంతో వచ్చిపోయే వారిపై దాడికి పాల్పడుతున్నాయి. ప్రతి ఏడాది కుక్కల నియంత్రణ ఆపరేషన్లు చేయించాలనే నిబంధన ఉన్నా అది ఆచరణలో అమలుకు నోచుకోవడం లేదు.

ధర్మవరంలో కుక్కకాటుకు గురైన చిన్నారి

**వాహనదారులపై దాడులు**

కుక్కల దాడిలో అత్యంత ప్రమాదకరంగా వాహనదారులపై చేసే దాడులు కన్పిస్తున్నాయి. వేగంగా వెళ్తున్న ద్విచక్రవాహనాల వెంట కుక్కల గుంపు వెంటపడుతోంది. వాహనం వెళ్లే వేగానికి సమానంగా కుక్కలు పరిగెడుతున్నాయి. దీంతో వాహదారుడు తీవ్ర భయాందోళనకు గురై వేగంగా వెళ్లి కిందపడడం లేదా కుక్కకాటుకు గురవడం లాంటి ఘటనలు అధికంగా జరుగుతున్నాయి. భార్యాభర్తలు వెళ్తున్న సమయంలో అయితే వెనుక కూర్చొన్న మహిళల చీరలు లాగి కిందపడేలా చేస్తున్నాయి. చిన్నారులు, వృద్ధులపైన కూడా వీటి దాడులు అధికంగా ఉంటున్నాయి.

**ప్రాణాంతకంగా మారుతున్న రేబిస్**

కుక్క కాటుకు గురైన వారు ప్రాణాంతక రేబిస్ వ్యాధికి గురయ్యే ప్రమాదం ఉంది. కుక్క కరిచినప్పుడు దాని లాలాజలం మనిషి శరీరంలోకి ప్రవేశిస్తుంది. ఇది ప్రాణాంతక రేబిస్ వ్యాధికి సోకేందుకు కారణం అవుతోంది. ఇది నాడీ వ్యవస్థద్వారా మెదడుకు చేరి ప్రాణాంతకంగా మారుతోంది. కుక్కలు కరిచిన 2, 3 నెలలు లేదా 10 నెలల తరువాత కొందరిలో రేబిస్ లక్షణాలు బయటపడుతున్నాయి. శరీరంలో కుక్కపరిచే ప్రాంతాన్ని బట్టి వైరస్ సోకే ప్రమాదం ఉంటుందని పశువైద్యాధికారులు చెబుతున్నారు. కుక్క కరిచిన వెంటనే తప్పనిసరిగా రేబిస్ ఇంజెక్షన్లు వేయించుకోవాలి. లేకుంటే అతి ప్రాణాంతకం అయ్యే ప్రమాదం ఉంది. అయితే ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవసరానికి సరిపడా రేబిస్ ఇంజక్షన్లు లేనట్లు తెలుస్తోంది. రేబిస్ ఇంజెక్షన్లు ఖరీదు ఎక్కువగా ఉండడంతో ప్రయివేటుగా దీనిని కొనుగోలు చేసి వేయించుకునేందుకు పేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

**కుక్కలను నియంత్రించాలి**

ఇటీవల కుక్కల దాడులు అధికం అయ్యాయి. రోడ్లపై కుక్కలు స్వైర విహానం చేస్తున్నాయి. వారం రోజులుగా క్రితం విధులు ముగించుకుని ఇంటికి వెళ్తుండగా కుక్కలు వెంటపడ్డాయి. దీంతో తీవ్ర భయాందోళనకు గురయ్యాను. కార్పొరేషన్ అధికారులు వీటిపై స్పందించాలి. కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వాసుపత్రిలో అవసరమైనన్ని రేబిస్ ఇంజెక్షన్లను అందుబాటులో ఉంచాలి.

**డి.అశ్వర్థనారాయణ, అనంతపురం.**

## భార్య బంగారు గొలుసును మింగేశాడు..!

### మూడు నెలలు పాటు కడుపులోనే చైన్

### ధర్మవరంలో ఘటన

**ప్రజాశక్తి-అనంతపురం**

భార్య బంగారు లాంగ్ చైన్‌ను భర్త మింగేశాడు. అతను దానిని మింగినట్లు అతనికే తెలియని పరిస్థితి. దాదాపు మూడు నెలల పాటు అది కడుపులోనే ఉంది. గత కొంతకాలంగా ఆయన అస్వస్థకు గురికావడంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ స్కానింగ్ చేయించగా కడుపులో బంగారు చైన్ ఉన్నట్లు గుర్తించారు. అనంతపురం వైద్యులు అతనికి ఎలాంటి శస్త్ర చికిత్సలు చేయకుండానే నోటిద్వారా చైన్‌ను బయటకు తీశారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి...

ధర్మవరం పట్టణం రాజేంద్ర నగర్‌కు చెందిన రామాంజనేయులు అనే వ్యక్తి తన భార్యకు చెందిన చైన్‌ను మింగేశాడు. ఎందుకు.. ఎప్పుడు దానిని మింగేశాడన్న విషయం ఆయనకు తెలియదు. కడుపులో చైన్ ఉండడంతో తీవ్ర అనారోగ్యానికి గురై చివరకు మాటలాడలేని స్థితికి చేరుకున్నాడు. కుటుంబ సభ్యులు ఇటీవల ఆయన్ను బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు స్కానింగ్ చేసి కడుపులోకి గొలుసు ఉన్నట్లు గుర్తించారు. ఆపరేషన్ చేసి దానిని బయటకు తీయాలని చెప్పారు. ఆపరేషన్‌కు డబ్బులు ఖర్చు చేయలేని బాధితులు అనంతపురం ప్రభుత్వాసుపత్రికి వెళ్లారు. అక్కడి వైద్యులు సుకుమర్ ఎలాంటి చిన్న కుట్టుకూడా లేకుండా ఆ గొలుసును బయటకు తీశారు. ప్రస్తుతం బాధితుని ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

# గుడ్డు ఏమైంది గురూ..?

◆ మే 25 వరకు అంగన్‌వాడీ కేంద్రాలకు అందని గుడ్డు.. ◆ గుత్తేదారుని చేతి వాటమా..? ఐసిడిఎస్ అధికారుల నిర్లక్ష్యమా.?

**ప్రజాశక్తి:- చిలమత్తూరు**

మే నెలలో 20వ తేది వరకు రెండు విడతలుగా అంగన్‌వాడీ కేంద్రాలకు రావల్సిన కోడిగుడ్లు చిలమత్తూరు మండలానికి రానట్లు తెలుస్తోంది. మూడో విడత కూడా 27వ తేదీ తర్వత పంపిణీ చేశారు. దీంతో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అంగన్‌వాడీ గుడ్లు అందలేదు. సంపూర్ణ పోషణలో భాగంగా ముఖ్యమైన పోషకాహారంగా చెప్పబడే గుడ్డును పంపిణీ చేయడంలో ఐసిడిఎస్ వైఫల్యం చెందిందా.? లేక గుత్తేదారుడు చేతివాటం పదర్శించారా అన్నది తేలాల్సి ఉంది. పాఠశాలలకు వేసవి సెలవులు కావడంతో అంగన్‌వాడీలకు సెలవులు ఉంటాయి. ఈ సెలవు రోజుల్లో కూడా అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వం నుంచి గుడ్లు సరఫరా అవుతాయి. వాటిని గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు క్రమం తప్పకుండా అందించాల్సి ఉంటుంది. సెలవులను ఆసరాగా చేసుకున్న గుత్తేదారుడు కొందరు ఐసిడిఎస్ సిబ్బందితో కలిసి మే నెల కోటా ఇవ్వకుండా కాజేసినట్లు ఆరోపణలు విన్పిస్తున్నాయి.

**గుడ్డు పంపిణీలో నిర్లక్ష్యం ఇలా..**

ప్రతి నెలా 1 నుంచి 10వ తేదీ వరకు మొదటి స్పెల్‌గా, 11-20 వరకు రెండవ స్పెల్ గా, 21 నుంచి నెలాఖరు వరకు 3వ స్పెల్‌గా విభజించి నెలకు మూడు సార్లు గుత్తేదారుడు అంగన్‌వాడీ కేంద్రాలకు గుడ్లు పంపిణీ చేస్తారు. చిలమత్తూరు మండల వ్యాప్తంగా 4 సెక్టర్‌లు, 94 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో మొదటి స్పెల్ పూర్తిస్థాయిలో కేంద్రాలకు చేరలేదు. ఇక రెండో స్పెల్ కేవలం దేమకేతేపల్లిలో 6 కేంద్రాలకు పంపిణీ చేశారు. ఇక 88 కేంద్రాలకు అందనట్లు తెలుస్తోంది. మూడో స్పెల్‌కు సంబంధించి గత నాలుగు రోజుల నుంచి కేంద్రాలకు గుడ్డును పంపిణీ చేస్తున్నారు. ఇవి మూడో స్పెల్లా లేక జూన్ నెలకు సంబందించినవా అన్న తర్జన బర్జనలో అంగన్‌వాడీ సిబ్బంది ఉన్నారు. ఎందుకంటే గుడ్లు వచ్చిన రోజు నుంచి పదిరోజులకు సరిపడా గుడ్లు పంపిణీ చేస్తారు. ఈ లెక్కన 3వ స్పెల్‌కు సంబంధించి. కొడికొండ సెక్టార్‌కి 4153, కోడూరు సెక్టార్‌కి 8363, చిలమత్తూరు 4182, దేమకేతేపల్లి సెక్టార్‌కి 7874 పంపిణీ చేశారు. ఈ లెక్కన మొదటి స్పెల్ పూర్తి స్థాయిలో పంపిణీ జరగకపోగా రెండవ స్పెల్ 90 శాతం పంపిణీ జరగనట్లు లెక్కలు చెబుతున్నాయి. మూడో స్పెల్ కూడా చివరి మూడు రోజులు పంపిణీ జరిగిన మే 25వ తేదీ వరకు కోడి గుడ్లు పంపిణీ జరగలేదు. వీటికి సంబంధించిన బిల్లులు గుత్తేదారులకు అందిస్తారా.? లేదా వాటిని మినహాస్తారా.? చేసిన పొరపాటును సర్దుబాటు చేసుకునేందుకు బాకీపడ్డ గుడ్డుని కేంద్రాలకు పంపిస్తారా.? లేదా.? అన్నది వేచి చూడాల్సి ఉంది.

**గుడ్డు అందని మాట వాస్తవమే...**

మొదటి స్పెల్ పూర్తి స్థాయిలో గుడ్లు అందలేదు. రెండవ స్పెల్‌లో కొన్నింటికి వచ్చాయి. మూడో స్పెల్ పూర్తిగా వచ్చాయి. 1,2 స్పెల్‌లు ఎందుకు అందించలేదంటే డివిజన్ వ్యాప్తంగా ఇలాంటి పరిస్థితే ఉందని అన్నారు. ఏజెన్సీకి వాహనాల రవాణ సమస్య లాంటివి ఉన్నందున పంపిణీ జరగడంలో జాప్యం అయ్యింది.

**రెడ్డి రమణమ్మ, సిడిపిఒ.**

# ఇసుక డంప్ సీజ్

ఇసుక డంప్‌ను పరిశీలిస్తున్న అధికారులు

**ప్రజాశక్తి-పరిగి**

మండల పరిధిలోని జయమంగళ నది నుంచి అనుమతులు లేకుండా తరలించి ఒకచోట భారీగా ఇసుక డంప్ చేసినట్లు సోషల్ మీడియాలో వార్తలు హల్‌చల్ చేయడంతో గురువారం సెబ్ అధికారులు స్పందించారు. ఎటువంటి అనుమతులు లేకపోవడం, సుమారు 700 టిప్పర్ల ఇసుక ఒకే చోట నిల్వ చేయడంపై అటు గ్రామస్తులు, ఇటు మండలంలోని ప్రజాప్రతినిధులు అధికారుల పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సగటు వ్యక్తికి ఇసుక కావా లంటే ఎన్నో కారణాలు చెప్పే అధికారులు జేపీ కన్‌స్ట్రక్షన్ యాజమాన్యం పనితీరుపై స్పందిం చకపోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. ఈ తరుణంలో డంపును పరిశీలించిన సెబ్ అధికారు లు జేపీ కన్‌స్ట్రక్షన్‌కు అనుకూలంగా ప్రవర్తించడం, కనీసం అనుమతులు కూడా చూడకపోవ డం అధికారుల పనితీరుకు నిదర్శనమని సిపిఎం మండల నాయకుడు నాగరాజు పేర్కొన్నా రు. రెండు నెలల నుంచి ఏకధాటిగా జయమంగళ నది నుంచి ఇసుక తరలిస్తున్నా అధికారు లు స్పందించకపోవడం వారి బాధ్యతారాహిత్యానికి నిదర్శనం అన్నారు. డంపు ఏర్పాటుపై సంబంధిత యాజమాన్యంపై అధికారులు కఠిన చర్యలు తీసుకోకపోతే సిపిఎం తరఫున తిరుగుబాటు మొదలవుతుందని హెచ్చరించారు.

## అసిస్టెంట్ కమిషనర్‌గా రామ్‌భూపాల్ రెడ్డి

**హిందూపురం:** హిందూపురం పురపాలక సంఘం అసిస్టెంట్ కమిషనర్‌గా రాంభూపాల్‌రెడ్డిని నియమిస్తూ గురువారం సాయంత్రం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గత కొన్ని నెలలుగా పురపాలక సంఘంలో అసిస్టెంట్ కమిషనర్ పోస్టు ఖాళీగా ఉంది. సాధారణ బదిలీల్లో భాగంగా పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్న రాంభూపాల్‌రెడ్డిని హిందూపురం పురపాలక సంఘానికి నియమించారు.

## 25వ రోజుకు సమ్మర్‌క్యాంప్

**అనంతపురం కలెక్టరేట్ :** జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి ఉచిత శిక్షణ శిబిరం గురువారం 25వ రోజుకు చేరుకుంది. ఇందులో 69 మంది విద్యార్థులు హాజరై వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ముఖ్యంగా యోగా, నృత్యం, స్పోకెన్ ఇంగ్లీష్, పుస్తక పఠనం, హ్యాండ్ రైటింగ్ వంటి పరీక్షల్లో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప గ్రంథాలయ అధికారిణి వి.సుబ్బరత్నమ్మ, ఇంతియాజ్ అహ్మద్, కావేరి, హేమమాలిని, ఉజ్జీనేశ్వరి, రీసోర్స్‌పర్సన్ ఎం.వెంకటేశప్ప, లక్ష్మి, రాజేష్, జ్యోతి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో పరిశీలిస్తున్న రాష్ట్ర ఉపాధి హామీ జాయింట్ కమిషనర్ శివప్రసాద్

## 'ఉపాధి' పనులను నాణ్యతగా చేపట్టండి

### రాష్ట్ర జాయింట్ కమిషనర్ శివప్రసాద్

**ఓబుళదేవరచెరువు:** ఉపాధి పనుల్లో భాగంగా మండల పరిధిలోని డబురువారిపల్లి వెంకటాపురం పంచాయతీలో నల్లగుట్లపల్లి వద్ద జరుగుతున్న అమృత్ సరోవర్ పనులను గురువారం రాష్ట్ర ఉపాధి హామీ జాయింట్ కమిషనర్ శివప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భ ంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పనులను నాణ్యతతో చేపట్టాలని సూచించారు. అమృత్ సరోవర్ పనుల వల్ల చెరువుల్లో పూడికతీత పనులు చేపట్టడం వల్ల రైతులకు ఎంతో ప్రయోజనకరమన్నారు. ఆయకట్టు రైతులకు ఈ పనులు ఎంతో ఉపయోగకరమన్నారు. రేపు కేంద్ర ప్రభుత్వ బృందం ఈ పనులను పరిశీలిస్తారని తెలిపారు. అనంతరం ఎంపీడీవో పోలప్ప కి సూచనలు చేశారు. ఆయన వెంట డ్వామా పీడీ రామాంజనేయులు, ఏపీడీ శ్రీనివాసరెడ్డి, ఏపీఓ సోమశేఖర్ రెడ్డి, సిఎల్ఆర్పీ శారద, సాంకేతిక సహాయకులు ఉన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఇన్‌ఛార్జి డిఇఒకు గాయాలు

రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఇన్‌ఛార్జి డీఈఓ మీనాక్షి

**రామగిరి :** శ్రీసత్యసాయి జిల్లా ఇన్‌ఛార్జి డీఈఓ మీనాక్షి రామగిరి మండలం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. ప్రభుత్వ పాఠశాలలు తనిఖీల్లో భాగంగా గురువారం ఆమె ఎంఈఓ గోపాల్‌తో కలిసి రామగిరి మండలం వెళ్లారు. రామగిరి నుంచి తిరిగి వెళుతున్న సందర్భంలో ఆమె ప్రయాణిస్తున్న వాహనం రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీ కొనడంతో ప్రమాదం చోటుచేసుకుంది. స్థానికులు గమనించి ఆమెను ఆసుపత్రికి తరలించారు.

## ధర్మవరం మున్సిపల్ కమిషనర్‌గా బండి శేషన్న

**ధర్మవరం టౌన్ :** ధర్మవరం మున్సిపల్ కమిషనర్‌గా బండి శేషన్నను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ పనిచేస్తున్న మల్లికార్జున గుంతకల్లు మున్సిపాలిటికి బదిలీ అయ్యారు. అక్కడ పనిచేస్తున్న బండి శేషన్న ఇక్కడికి బదిలీపై వచ్చారు.

# విద్యార్థుల సంఖ్య పెంచాలి

### సివిల్ సప్లయ్ కమిషనర్ అరుణ్‌కుమార్

మొక్క నాటుతున్న సివిల్ సప్లయ్ కమిషనర్ అరుణ్‌కుమార్

**గార్లదిన్నె :** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలని సివిల్ సప్లయ్ కమిషనర్ అరుణ్‌కుమార్ సూచించారు. గురువారం మండల పరిధిలోని ఇల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నాడు-నేడు కింద చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఎంతమంది విద్యార్థులు ఉన్నారు.. ఎన్ని తరగతి గదులు ఉన్నాని ప్రధానోపాధ్యాయినిని అడగ్గా 180 విద్యార్థులు ఉండగా, 18 తరగతి గదులు ఉన్నాయని వివరించారు. అనంతరం తరగతి గదులు, వంటగది, మరుగుదొడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల పున:ప్రారంభమయ్యే నాటికి మరుగుదొడ్లు వాడుకలో వచ్చే విధంగా చూడాలని ఆదేశించారు. అలాగే త్వరితగతిన పనులు పూర్తి చేయాలన్నారు. విద్యార్థుల సంఖ్యను కూడా పెంచి నాణ్యమైన విద్యా బోధన చేయాలన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో జెసి కేతన్‌గార్గె, డిఇఒ సాయిరామ్, తహశీల్దార్ ఉషారాణి, ఎంపిడిఒ తేజోష్ణ, ఎంఇఒ తారా చంద్రానాయక్, వెలుగు ఎపిఎం శ్రీరాములు, ఐఒఆర్‌డి వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపిడిఓ సోనియా బాయి

## విధులు సక్రమంగా నిర్వహించాలి

**మడకశిర రూరల్ :** సచివాలయ ఉద్యోగులు విధులు సక్రమంగా నిర్వహించాలని, ముఖ్యంగా సమయానికి కార్యాలయానికి హాజరవ్వాలని, లేనిచో చర్యలు తప్పవని ఎంపీడీవో సోనియా బాయి హెచ్చరించారు. మండల పరిధిలోని మనూరు గ్రామ సచివాలయాన్ని గురువారం ఆమె సందర్శించి రిజిస్టర్లను పరిశీలించారు. సచివాలయంలో ఉద్యోగులు అందు బాటులో ఉంటూ ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి లబ్ధిదారుడికి అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆమె వెంట శైలజ, పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

కళాశాలకు తాగునీటి ట్యాంకు అందజేస్తున్న దాత పువ్వాడ శ్రీనివాసులు

## తాగునీటి ట్యాంక్ వితరణ

**ధర్మవరం టౌన్ :** పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలకు గురవారం దాత పువ్వాడ శ్రీనివాసులు తాగునీటి ట్యాంకును అందజేశారు. 1500 లీటర్ల సామర్థ్యం కలిగిన తాగునీటి ట్యాంకును ధర్మవరం యోగా అసోషియేషన్ అధ్యక్షుడు గాజుల సోమేశ్వరరెడ్డితో కలిసి ఆయన కళాశాలకు అందజేశారు.

## ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

**కదిరి అర్బన్:** పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని, పదో తరగతి పాసైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ చెన్నకేశవ ప్రసాద్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. బైపిసి, ఎంపీసీ, సీఈసీ, హెచ్ఈసి, ఎంఎల్‌టి, తదితర గ్రూపులు ఉన్నాయన్నారు. మరింత సమాచారం కోసం కళాశాలలో సంప్రదించాలని సూచించారు. అలాగే ద్వితీయ సంవత్సరం తరగతులు ప్రారంభమయ్యాయని విద్యార్థులు తప్పనిసరిగా కళాశాలకు హాజరుకావాలని తెలిపారు.

## అరుణాచలానికి ప్రత్యేక బస్సు సౌకర్యం

**కదిరి టౌన్ :** అరుణాచలం పుణ్యక్షేత్రంలో గిరి ప్రదక్షిణ చేసేందుకు కదిరి పట్టణ భక్తుల కోరిక మేరకు ఈ నెల 3వ తేదీ కదిరి డిపోలో ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజరు బి.మైనుద్దీన్ గురువారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఆ బస్సు కాణిపా కం, గోల్డెన్ టెంపుల్‌కు వెళ్తుందన్నారు. పెద్దలకు రూ. 860, పిల్లలకు రూ. 450 ఛార్జీ వసూ లు చేస్తారన్నారు. ఆసక్తి ఉన్న వారు రిజర్వేషన్ కౌంటర్‌లో టికెట్ పొందవచ్చు అన్నారు. 81259 16181 నంబర్‌కు ఫోన్ పే చేసి టికెట్ పొందవచ్చని అసిస్టెంట్ మేనేజర్ హరిమోహన్ తెలిపారు.

## చంద్రబాబుపై స్పీకర్ తమ్మినేని వ్యాఖ్యలు విచారకరం

**మడకశిర రూరల్:** టిడిపి అధినేత చంద్రబాబునాయుడుపై స్పీకర్ తమ్మినేని సీతారాం చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే ఈరన్న గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తమ్మినేని చేసిన వ్యాఖ్యలు స్పీకర్ పదవికి చెడ్డ పేరు తెచ్చే విధంగా ఉన్నాయని విమర్శించారు. ఉన్నతమైన పదవిలో ఉండి రాజకీయ భిక్ష పెట్టి మంత్రి స్థానం కల్పించిన చంద్రబాబుపై అలా వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. గతంలో టిడిపి నుంచి నాయకుడిగా ఎదిగారన్న విషయం మరిచిపోవద్దని హితవు పలికారు. మహానాడు ఘనవిజయం సాధించడంతో పాటు చంద్రబాబు ప్రకటించిన మేనిఫెస్టోపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తుండడంతో వైసిపి నాయకులు ఓర్వలేక చంద్రబాబుపై ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని ఖండించారు.

## ఏపీ టూరిజం స్పెషల్ సీఎస్‌కి వినతి

**పెనుకొండ :** పెనుకొండ పర్యాటక పోరాట కమిటీ అధ్యక్షుడు, న్యాయవాది జె.ప్రతాపరెడ్డి గురువారం ఏపీ టూరిజం స్పెషల్ చీఫ్ సెక్రటరీ డాక్టర్ రజత్ భార్గవ్‌ని కలిసి వినతి పత్రం సమర్పించారు. పెనుకొండ కొండపైకి రోడ్డు, బేస్ క్యాంపు నుంచి ఎన్‌హెచ్-44కు తిరువెంగలరాయలు చెరువు కట్ట మీదుగా బైపాస్ రోడ్డు, కొండపైకి విద్యుత్ లైన్, తాగునీరు, బేస్ క్యాంపు నుంచి దేవాలయం వరకు రోప్ వే పనులకు నిధులు మంజూరు చేయాలని కోరారు. ముఖ్యంగా చెత్త డంప్ యార్డ్‌ను బేస్ క్యాంపు నుంచి తొలించాలని విజ్ఞప్తి చేశారు. బేస్ క్యాంపు స్థలాన్ని ఇస్కాన్ సంస్థకు లీజుకు కాకుండా విక్రయ పత్రం ద్వారా స్వాధీనం చేయాలని కోరారు.

టూరిజం స్పెషల్ చీఫ్ సెక్రటరీ డాక్టర్ రజత్ భార్గవ్‌కి వినతి పత్రం ఇస్తున్న జె.ప్రతాపరెడ్డి

# వైసిపి హయాంలో యథేచ్ఛగా భూ కబ్జాలు

**ప్రజాశక్తి-గోరంట్ల**

వైసిపి హయాంలో భూ కబ్జాలకు అడ్డూ అదుపూ లేకుండా పోయిందని మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మ విమర్శించారు. మండల పరిధిలోని బూదిలి గ్రామ పొలం సర్వే నంబర్-531లో కోటిలింగేశ్వరస్వామి ఆలయ మాన్యం 4.09 ఎకరాలను వైసిపి నాయకులు కబ్జా చేసేందుకు ప్రయత్నించారు. ఆ భూములను గురువారం వారు పరిశీలించి మాట్లాడారు. ఒక్క ఛాన్స్ అని ప్రజలను కోరి అధికారంలోకి వచ్చిన వైసిపి నాయకులు రాష్ట్రం అభివృద్ధిని మరచి యథేచ్ఛగా భూ కబ్జాలకు పాల్పడుతు న్నారని, వారికి ఇదే ఆఖరి ఛాన్స్ అన్నారు. ఎమ్మెల్యే శంకరనారాయణ, అతని సోదరుల అండ దండలతో వైసీపీ నాయకుల భూ కబ్జాలకు అడ్డూ అదుపు లేకుండా పోయిందన్నారు. బూదిలి గ్రామంలో ధరణి నాగప్ప భార్య బసమ్మ 1943లో భూమిని కొనుగోలు చేశారు. ఆమెకు సంతానం లేకపోవడంతో 4.84 ఎకరాల భూమిని కోటిలింగేశ్వరస్వామి ఆలయంలో ధూప దీప నైవేద్యం కోసం 1950లో వీలునామా ద్వారా రిజిస్ట్రేషన్ చేయించిందన్నారు. అందులో 75 సెంట్లు 2015లో విద్యుత్ సబ్ స్టేషన్‌కు ఇవ్వగా మిగిలిన భూమి విలువ రూ. 5 కోట్ల పైనే ఉంటుందన్నారు. ఈ భూమిపై కన్నేసిన ఎమ్మెల్యే బినామీలు ప్రభుత్వ పెద్దల అండతో కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. పొలంలో బండరాళ్లు పాతి ఆక్రమించేందుకు ప్రయత్నం చేయడం దుర్మార్గమని, వెంటనే వారి ఆగడాలు రెవెన్యూ అధికారులు అడ్డుకోవాలని, లేని పక్షంలో పెద్ద ఎత్తున ధర్నాలు చేస్తామని హెచ్చరించారు. వారి వెంట టిడిపి నాయకులు ఉన్నారు.

తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న జనసేన నాయకులు

**దేవుడి మాన్యాన్ని కాపాడాలి**

**గోరంట్ల రూరల్:** మండల పరిధిలోని బూదిలి గ్రామంలో వెలసిన కోటిలింగేశ్వరస్వామి ఆలయ మాన్యం భూమిని కాపాడాలని గురువారం జనసేన పార్టీ ఆధ్వర్యంలో తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. అంతకుముందు వారు ఆలయ కమిటీ సభ్యులతో కలిసి మాన్యం భూమిని సందర్శించారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు మాట్లాడుతూ వైసిపి హయాంలో పెనుకొండ నియోజకవర్గంలో భూ కబ్జాలు ఎక్కువయ్యాయన్నారు. ఎక్కడ ఖాళీ స్థలం కనపడినా అధికార పార్టీ నాయకులు కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. బూదిలిలో కబ్జాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో పెద్ద ఎత్తున ధర్నాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి సురేష్, సంయుక్త కార్యదర్శి వెంకటేష్, మండల అధ్యక్షుడు సంతోష్, నాయకులు అనిల్‌కుమార్, నాగేంద్ర, నరేశ్, బాబర్, తిరుపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ భూములను పరిశీలిస్తున్న టిడిపి నాయకులు

# నేరాలు ఘోరాలు

ప్రమాదంలో గాయపడిన వారు

## ఆటో, బొలెరో ఢీ.. పలువురికి తీవ్రగాయాలు

**హిందూపురం :** మండల పరిధిలోని మలగూరు పంచాయితీ నందమూరి నగర్ వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పలువురు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. హిందూపురం పట్టణం నుంచి చెర్లోపల్లి వైపు వెళ్తున్న ప్యాసింజర్ ఆటోను హిందూపురం నుంచి గోరంట్ల వైపు వెళ్తున్న బొలెరో వాహనం అతి వేగంగా వచ్చి నందమూరి నగర్ వద్ద ఉన్న స్పీడ్ బ్రేకర్ వద్ద ఢీ కొంది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ షరీఫ్, జంగాలపల్లికి చెందిన రామాంజనమ్మ, పత్తికుంట పల్లికి చెందిన రామాంజనమ్మ, చెర్లోపల్లికి చెందిన శైలజ, సందీప్ తీవ్రంగా గాయపడగా మేరీ, చంద్రశేఖర్, ప్రశాంతి, నరసింహప్పలకు స్వల్ప గాయాలయ్యాయి. ఈ సంఘటనలో బొలెరో వాహనం డ్రైవర్ పరారయ్యాడు. విషయం తెలుసుకున్న స్థానికులు 108 వాహనానికి సమాచారం అందించారు. క్షతగాత్రులను హిందూపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వారిలో శైలజ, రామాంజనమ్మ పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు సూచించి, మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆసుపత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు హిందూపురం రూరల్ స్టేషన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రమాదంలో గాయపడిన వారు

## మిస్సింగ్ కేసు నమోదు

**బత్తలపల్లి :** మండల పరిధిలోని ఈదుల ముష్టూరు గ్రామానికి చెందిన ఓ యువతి(24) నాలుగు రోజులుగా కనిపించడం లేదని ఆ యువతి తండ్రి సాకే రామకష్ణ గురువారం ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు. రామకృష్ణ కుమార్తె గత నెల 29వ తేదీ నుంచి కనిపించకపోవడంతో బంధువులు, స్నేహితుల ఇళ్లల్లో విచారించినా ప్రయోజనం లేకపోయిం ది. దీంతో తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నారు.

## మట్కా బీటర్లు అరెస్ట్

**కొత్తచెరువు :** కొత్త చెరువులో గురువారం మట్కా నిర్వాహకులను అరెస్టు చేసినట్టు ఎస్సై లింగన్న తెలిపారు. అందిన సమచారం మేరకు దాడులు చేసి ముగ్గురు మట్కా నిర్యాహకులను అరెస్టు చేసి రూ. 55,150 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. స్థానిక బుక్కపట్నం రోడ్డు, శివాలయం పరిసర ప్రాంతాలు, పొలాల్లో మట్కా రాస్తున్న నారాయణ, పెద్దన్న, రామ్మోహన్‌లను అరెస్టు చేసి పట్టీలను స్వాధీనం చేసుకొని వారిని కోర్టుకు హాజరు పరచినట్లు ఎస్ఐ తెలిపారు.

చెస్‌లో ప్రతిభ చాటిన ఆఫ్రీద్ ఖాన్‌ను అభినందిస్తున్న దృశ్యం

## చెస్ పోటీల్లో 'పురం' యువకుడి ప్రతిభ

**హిందూపురం :** నెల్లూరులో మే 30, 31న జరిగిన రాష్ట్ర స్థాయి చదరంగం పోటీల్లో హిందూపురానికి చెందిన యువకుడు ఆఫ్రీద్‌ఖాన్ ప్రతిభ కనబరిచాడు. చదరంగం పోటీల్లో 7 గేములకు గాను 6.5 పాయింట్లు సాధించి విజేతగా నిలిచాడు. దీంతో నిర్వాహకులు ఆఫ్రీద్‌ఖాన్‌కు రూ.20 వేల నగదు బహుమతితో పాటు ట్రోఫీ, మెడల్ అందజేశారు. చదరంగంలో రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరచడంపై కోచ్ ఆరీఫుల్లా, పలువురు అభినందించారు.

## 1వ తేదీనే పింఛను పంపిణీ

**బత్తలపల్లి :** సామాజిక పింఛన్ల పంపిణీలో సరికొత్త ఒరవడితో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పండుగ రోజైనా.. సెలవైనా ప్రతి నెలా ఠంచనుగా 1వ తేదీనే లబ్ధిదారులకు వాలంటీర్లు పింఛన్ సొమ్ము అందజేస్తున్నారు. ఈ క్రమంలో జూన్ నెలకు గానూ గురువారం ఉదయానికే 50 శాతం పింఛన్లు పంపిణీ చేయడం గమనార్హం. ప్రతి నెలా 1వ తేదీ ఉదయాన్నే లబ్ధిదారుల చెంతకే వాలంటీర్లు వెళ్లి పింఛను సొమ్ము అందిస్తున్నారు. ఉదయం సర్వర్లు బిజీగా ఉంటాయన్న ఉద్దేశంతో మండలంలో కొందరు వాలంటీర్లు తెల్లవారుజామున 4 గంటల నుంచే పింఛన్ల పంపిణీని ప్రారంభించారు. మండలంలో వృద్ధాప్య, వితంతు, వికలాంగ, తదితర సామాజిక పింఛన్లు మొత్తం 6,181 ఉన్నాయి. గురువారం సాయంత్రం 5 గంటలకు 4,328 మందికి సొమ్ము అందజేసి 70 శాతం పంపిణీ పూర్తి చేశారు. పనులకు వెళ్లిన కొందరికి రాత్రి అందజేసి 80 శాతంపైగా పూర్తి చేశారు. వంద శాతం పూర్తి చేసి లక్ష్యం చేరుకునేందుకు చివరికి ఆసుపత్రి, ఉపాధి పనులు, పొలాల వద్దకు వెళ్లిలబ్ధిదారులకు పింఛను సొమ్ము అందజేశారు. దీంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా మండల పరిధిలోని ఎం.చెర్లోపల్లి గ్రామానికి చెందిన ముద్దపాటి వెంకటేష్ 'అనారోగ్యంతో అనంతపురంలోని సవేరా ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా వాలంటీర్ ఆదినారాయణ అక్కడికి వెళ్లి పింఛన్ సొమ్ము అందజేశారు. దీంతో ఆయన సంతోషం వ్యక్తం చేశారు.

# అభివృద్ధి పనుల్లో వేగం పెంచండి

## రాష్ట్ర ముఖ్య కార్యదర్శి డాక్టర్ జవహర్ రెడ్డి

**ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్**

ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతంగా చేపట్టాలని రాష్ట్ర ముఖ్య కార్యదర్శి డాక్టర్ జవహర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆయ న గురువారం అమరావతి నుంచి జగనన్నకు చెబుదాం, భూరక్ష, భూ హక్కు, రీసర్వే, జాతీయ రహదారులకు భూ సేకరణ, టూరిజం భూ సమస్యలు, టవర్లకు భూకేటాయింపులు, స్పందన గ్రీవెన్స్‌లు, గృహ నిర్మాణం, ఇళ్ల స్థలాలు, పంచాయతీరాజ్, తదితర అంశాలపై జిల్లాల కలెక్టర్లతో వర్చువల్ విధానంలో సమీక్షించారు. పుట్టపర్తి కలెక్టరేట్‌లోని స్పందన వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు, డిఆర్‌ఓ కొండయ్య వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పై అంశాలన్నీ పురోగతిలో ఉన్నాయని గడువులోగా పూర్తి చేస్తామని ముఖ్య కార్యదర్శికి వివరించారు. కార్యక్రమంలో సిపిఓ విజయ్ కుమార్, పిఆర్ ఎస్ఇ గోపాల్ రెడ్డి, గ్రామ, వార్డు సచివాలయాల నోడల్ అధికారి శివారెడ్డి, డిఆర్‌డిఎ పిడి నరసయ్య, హౌసింగ్ ఏడి చంద్రమౌళి రెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## గర్భిణులకు వైద్యపరీక్షలు

**లేపాక్షి :** మండల పరిధిలోని కల్లూరు, నాయనపల్లి, కొండూరు, మానేపల్లి, లేపాక్షి పంచాయతీలోని గ్రామాలకు చెందిన 65 మంది గర్భిణులకు గురువారం మండల వైద్యాధికారి డాక్టర్ వెంకట చిరంజీవి ఆధ్వర్యంలో నెల వారీ ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. అలాగే వ్యక్తిగత పరిశుభ్రత, సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తలు, పోషకాహారం ఆవశ్యకత, క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. హాజరైన గర్భిణులకు పరిగి గ్రామానికి చెందిన వేణుగోపాలరావు దివ్య ఎడ్యుకేషనల్, ఛారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు భోజనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని డిసెంబర్ వరకు కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సిఎచ్ ఓ హుస్సేన్ బీ, ఎంపీహెచ్ఓ సుదర్శన్ బాబు, సుబ్రహ్మణ్యం, పిఎచ్ఎన్ భాగ్యలక్ష్మి, హెల్త్ సూపర్‌వైజర్ గోవిందప్ప, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

## అనారోగ్యంతో మాజీ ఎంపీపీ మృతి

**గుడిబండ:** మండల పరిధిలోని కల్లురొప్పం గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ గోవిందప్ప అనారోగ్యానికి గురై బెంగళూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి గ్రామానికి వెళ్లి గోవిందప్ప కుటుంబాన్ని పరామర్శించారు. మాజీ జడ్పిటిసి జిబి.శివకుమార్ గోవిందప్ప మృతదేహాన్ని సందర్శించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఆయన వెంట వైసిపి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

గోవిందప్ప మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

## బాధిత కుటుంబానికి 'పల్లె' ఆర్థికసాయం

**ఓబుళదేవరచెరువు:** మండల పరిధిలోని కొండకమర్ల గ్రామం చెరువువాండ్లపల్లి గ్రామానికి చెందిన టిడిపి యువ నాయకుడు చంద్ర(36) గురువారం గుండెపోటుతో మృతి చెందాడు. ఈ విషయం తెలిసిన వెంటనే మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి ఆ గ్రామం వెళ్లి చంద్ర మృతదేహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అలాగే చంద్ర కుటుంబ సభ్యులకు పరామర్శించి, ఆర్థిక సహాయం అందజేశారు. అధైర్య పడొద్దు నేనున్నానని వారికి భరోసా ఇచ్చారు. ఆయన వెంట డాక్టర్ జాకీర్ అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

చంద్ర కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేస్తున్న పల్లె

# విద్యతోనే గుర్తింపు

**ప్రజాశక్తి-హిందూపురం**

ప్రపంచంలో చదువుకు మించిన సంపద లేదని, క్రమశిక్షణతో విద్యనభ్యసిస్తే ప్రపంచ గుర్తింపు లభిస్తుందని వక్తలు పేర్కొన్నారు. పట్టణంలోని త్యాగరాజనగర్‌లో ఉన్న శ్రీమార్గదర్శి విద్యా నికేతన్ యాజమాన్యం కె.సాయికళ, కె.మాళప్ప దంపతుల ఆధ్వర్యంలో హెల్పింగ్ హ్యాండ్స్ గ్రూపు సభ్యులు శ్రీధర్‌గౌడ్, భగీరథ నవీన్ చంద్ర, బి.అంజప్ప సౌజన్యంతో ఉచిత వేసవి బడి నిర్వహించారు. గురువారం పాఠశాల కరస్పాండెంట్ కె.మాళప్ప అధ్యక్షతన ముగింపు సమావేశం ఘనంగా జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎసిఎన్ సిల్క్స్ యజ మాని ఎసి నాగరాజుతో పాటు దాతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యతోనే సకల సంపదలు ఒనకూరుతాయని, మంచి జ్ఞానవంతులుగా సమాజంలో గుర్తింపు పొందుతారని, తోటి మానవునికి సాయపడే గుణం లభిస్తుందన్నారు. అటువంటి విద్యను ప్రతి ఒక్కరూ అభ్యశించాలని సూచించారు. 25 సం.రాలుగా మార్గదర్శి విద్యానికేతన్ నిర్వాహకులు వేసవి సెలవుల్లో పేద విద్యార్థులకు ఉచితంగా తరగతులు నిర్వహించడంతో పాటు దాతల సహకారంతో భోజన సౌకర్యం, పుస్తకాలు అందించి వారి విద్యాభివద్ధికి కషి చేయడం అభినందనీయమన్నారు. అనంతరం విద్యార్థులకు ధ్రువపత్రాలు అందజేశారు. ఈ సందర్భం గా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం దాతల ను సన్మానించారు. కార్యక్రమంలో బిఐటి దయానంద్, నాగిరెడ్డి, ఆర్‌వి మెలోడీస్ రాజు, సింగ ర్ గణేష్, సాయిరామ్ చంద్ర, హనుమంతు, ఉపాధ్యాయులు దాస్, బిఎస్ కుమారి, మమత, తేజేశ్వరి, సాయి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సర్టిపికెట్లు ప్రదానం చేస్తున్న దృశ్యం

## భూముల రిజిస్ట్రేషన్ స్టాంప్ డ్యూటీ పెంపు దుర్మార్గం

**ప్రజాశక్తి -పెనుకొండ**

భూముల రిజిస్ట్రేషన్ స్టాంప్ డ్యూటీ పెంచడం దుర్మార్గం అని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మ పేర్కొన్నారు. పట్టణంలోని తన కార్యాలయంలో గురు వారం ఆమె విలేకరుల సమావే శంలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఖజానా నింపుకునేందుకు భూముల మార్కెట్ విలువను పెంచడం దుర్మార్గమైన చర్య అన్నారు. రిజిస్ట్రేషన్ చార్జీలు పెరగడంతో భూముల లావాదేవీలు జరగడం కష్టంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే అర్హులైన మండల విలేకరులందరికీ అక్రిడిటేషన్ మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లాలో 32 మండలాలు ఉండగా ఓ పత్రికకు 53 ఇచ్చి, మిగతా పత్రికలకు జీవోను అడ్డం పెట్టుకొని 17 మాత్రమే మంజూరు చేయడం శోచనీయమన్నారు. కార్యక్రమం లో శ్రీరాములు, సూర్యనారాయణ, ప్రసాద్, సుబ్రహ్మణ్యం, త్రివేంద్రనాయుడు, మారుతి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

విలేకరులు సమావేశంలో మాట్లాడుతున్న సవితమ్మ

## కెజిబివి బోర్డులో మారని జిల్లా పేరు..

**రొళ్ల :** మండల కేంద్రమైన రొళ్ల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయ(కెజిబివి)లో బోర్డుపై నేటికీ అనంతపురం జిల్లా అని ఉండడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పిల్లలను స్థానిక కెజిబివిలో చేర్పించడానికి వచ్చిన తల్లిదండ్రులు ఇక్కడ బోర్డుపై అనంతపురం జిల్లా అని ఉండడంతో గందరగోళానికి గురవుతున్నారు. ఈ విషయంపై సంబంధిత ఎస్‌ఓని వివరణ కోరగా వ్యంగ్యంగా సమాధానం ఇచ్చారు. ఈ విషయంపై ఉన్నతాధికారులు స్పందించి విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు స్పష్టత ఇవ్వాలి.

## చౌకదుకాణాల్లో రాగులు పంపిణీ

**రొద్దం :** మండల పరిధిలోని బొక్కసంపల్లి పంచాయతీ ఎల్‌జిబి నగర్‌లో రాగుల పంపిణీ కార్యక్రమాన్ని గురువారం సిఎస్‌డిటి పోతన్న సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన రాగులను పరిశీలించి కార్డుదారులకు సక్రమంగా పంపిణీ చేయాలని ఎండియు డీలర్లను ఆదేశించారు. ఆయనతో పాటు ఎండియు వాహన డ్రైవర్ నాగార్జున, సివిల్ సప్లై సిఓ అశోక్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రాగులు పంపిణీ చేస్తున్న దృశ్యం

# టిడిపి మేనిఫెస్టోతో అందరికీ లబ్ధి

**ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్**

మహానాడులో టిడిపి అధినేత చంద్రబాబునాయుడు ప్రకటించిన మేనిఫెస్టో అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి చేకూరేలా ఉందని టిడిపి నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం పట్టణంలో టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేసి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భం గా సామకోటి మాట్లా డుతూ మహాశక్తి పథకం ద్వారా 18 ఏళ్లు నిండిన మహిళలకు నెలకు రూ. 1500, తల్లికి వందనం కింద ఇంట్లో ఎంతమంది విద్యార్థులు ఉన్నా అందరికీ ఒక్కొక్కరికి ఏడాదికి రూ. 15 వేలు, దీపం పథకం కింద ఏడాదికి 3 ఉచిత సిలిండర్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, అన్నదాతకు ఏటా రూ. 20 వేలు ఆర్థిక సహాయం, యువగళం నిధి ద్వారా ప్రతి నిరుద్యోగికి నెలకు రూ. 3 వేలు భతి, బీసీల రక్షణ చట్టం, ఇంటింటికి కొళాయి, తదితర పథకాల వల్ల అన్ని వర్గాల వారు లబ్ధి పొందుతారన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి చెన్నకేశవులు, పట్టణ కార్యదర్శి అమ్మినేని కేశవ నాయుడు, మాజీ కౌన్సిలర్ సుబ్బమ్మ, బేకరీ నాయుడు, వీరాంజనేయులు, లింగప్ప, సాదిక్ వలి, సాయి ప్రసాద్ పాల్గొన్నారు.

పుట్టపర్తిలో చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు



హిందూపురంలో చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

**హిందూపురం :** బడుగు, బలహీన వర్గాలకు అభివృద్ధికి పాటుపడేది టిడిపి మాత్రమే నని, ప్రజా సంక్షేమం కోసం నిరంతరం శ్రమించే వ్యక్తి నారా చంద్రబాబునాయుడు అని టిడిపి నాయ కులు పేర్కొన్నారు. మహానాడు వేదికగా విడుదల చేసిన మేనిఫెస్టోపై హర్షం వ్యక్తం చేస్తూ గురువారం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ నివాసం వద్ద చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ మాజీ ఛైర్‌పర్సన్ లక్ష్మి, తెలుగు మహిళ రాష్ట్ర కార్యదర్శి పరిమళ, పార్లమెంట్ ఉపాధ్యక్షురాలు శ్రీదేవి, పార్లమెంట్ కార్యదర్శి చెన్నమ్మ మాట్లాడుతూ మేనిఫెస్టోలో మహాశక్తి పథకం మహిళలకు గౌరవంగా ఉందని తెలిపారు.టీ మేనిఫెస్టో దెబ్బకు జగనాసుర పాలన అంతం కావడం ఖాయమన్నారు. పార్టీ ఆవిర్భావం నుంచే మహిళల పక్షాన నిలిచిందన్నారు. ఎన్టీఆర్ ఆనాడే స్త్రీలకు ఆస్తిలో సమాన హక్కు కల్పించగా, చంద్రబాబు డ్వాక్రా సంఘాలు ఏర్పాటు చేసి ఆర్థికంగా పైకి తీసుకొచ్చారన్నారు. కార్యక్ర మంలో పట్టణ అధ్యక్షురాలు విజయలక్ష్మి, తెలుగు మహిళ నియోజక వర్గ అధ్యక్షురాలు మాలక్క, అంగన్‌వాడీ రాష్ట్ర కార్యదర్శి వెంకట లక్ష్మి, కౌన్సిలర్లు మంజుల, మహ లక్ష్మి, మాజీ కౌన్సిలర్ శశికళ, పట్టణ అధ్యక్షులు డిఈ రమేష్ కుమార్, క్లస్టర్స్ అమర్నాథ్, రాఘవేంద్ర, నాయకులు నెట్టప్ప, దుర్గా, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

**ధర్మవరం టౌన్ :** టీడీపీ అధినేత చంద్రబాబు ప్రకటించిన మేనిఫెస్టోపై హర్షం వ్యక్తం చేస్తూ గురువారం రాష్ట్ర కార్యదర్శి కమతం కాటమయ్య ఆధ్వర్యంలో పట్టణంలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే చంద్రబాబు చిత్రపటానికి పాలాభి షేకం, తేనాభిషేకం చేశారు. ఈ సందర్భంగా టీడీపి నాయకులు మాట్లాడుతూ ఆడ బిడ్డకు నెలకు రూ. 1500, ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు, అమ్మవందనం కింద ఏడాదికి రూ. 15 వేలు, ఆర్టీసీ బస్సుల్లో ఆడబిడ్డలకు ఉచిత ప్రయాణం, రైతుకు ఏడాదికి రూ. 20వేలు వంటి పథకాలను ప్రకటించడం సంతోషదాయకమన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో నియోజకవర్గంలో టీడీపీకి అఖండ విజయాన్ని అందించేలా అన్ని వర్గాల ప్రజలు టీడీపీకి మద్దతు ఇవ్వాల న్నారు. కార్యక్రమంలో పురుషోత్తంగౌడ్, గరుగు వెంగప్ప, చింతపులుసు పెద్దన్న, భీమనేని ప్రసాదనాయుడు, నాగూర్ హుస్సేన్, పరిశే సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న టీడీపీ శ్రేణులు

**'భవిష్యత్తుకు గ్యారెంటీ'తో ప్రతికుటుంబానికి లబ్ధి**

టిడిపి ప్రకటించిన 'భవిష్యత్తుకు గ్యారెంటీ' సంక్షేమ పథకాలతో రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరుతుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శులు గోనుగుంట్ల విజయ్‌కుమార్, కమతం కాటమయ్య పేర్కొన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో గురువారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో టీడీపీ నాయకులు పురుషోత్తంగౌడ్, చిగిచెర్ల ఓబిరెడ్డి, చింతలపల్లి మహేశ్ చౌదరి, నాగూర్ హుస్సేన్ గొట్లూరు, భీమనేని ప్రసాదనాయుడు, రాళ్లపల్లి షరీఫ్, రహీంబాషా, గోసల శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

## 3 నుంచి రామయ్యనహట్టిలో క్రికెట్ టోర్నమెంట్

**గుడిబండ:** మండల పరిధిలోని రామయ్యనహట్టిలో ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకు చిత్రలింగేశ్వరస్వామి క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహి స్తున్నట్లు నిర్వాహకులు మంజునాథ్, సిద్ధలింగప్ప, నాగరాజు తెలిపారు. పాల్గొనే జట్టు రూ. 601 ఎంట్రీ ఫీజు చెల్లించాలన్నారు. విజేత జట్టుకు రూ. 12 వేలు, రన్నర్స్ జట్టుకు రూ. 6 వేలు షీల్డు అందజేస్తామన్నారు.

**In the Court of the Senior Civil Judge: Hindupur**

I.A.No.562/2019 in I.A.278/2017 in O.S.No.51/2016

**Between:**

D.Naresh Babu ...Petitioner/ Plaintiff

And

K.Nazeer Sab and others ...Respts/Defendants

**NOTICE TO THE RESPONDANTS 2,3,5 to 8**

To,

02) K.Narasimhappa @ Seena /o Gitta Kattaiah,
03) P.Mahaboob Bee W/o Late K.Nazeer Sab,
05) P.Shaheeda Banu W/o Late P.Mustak Khan,
06) Jainab D/o Late P.Mustak Khan,
07) Tasleem D/o P.Mustak Khan,
08) Munitiaz S/o Late P.Mustak Khan,

All are residents of Utakur-Village, Parigi Mandal.

Take notice that the above matter stands posted to 15-06-2023 for your appearance and hence you are required to attend either in person or through your advocate on the above said date at 10.30 A.M. before the above said court, failing which the matter will be decided exparte.

(By Order of the Court)

K.Satyanarayana, Advocate
Hindupur, Cell: 9440259524.